క్లుప్తంగా

విధి విధానాలు పాటించాలి

శ్రీకాళహస్తి: విధి విధానాలను పాటించాలని శ్రీకాళహస్తి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంతి తెలిపారు. పట్టణంలోని కొత్తపేటలో ఉన్న శ్రీరామమందిరంలో కెమిస్ట్ డ్రగ్గిస్ట్ మెడికల్ దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రగ్ లైసెన్స్, ఫార్మసిస్ట్ సర్టిఫికెట్ దుకాణంలో ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాము, మధుసూదన్‌రావు, నంద, అమరా జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో నూతన కార్యవర్గం




రాజురామచంద్రరావు, గురవారెడ్డి

ఏర్పేడు: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఫ్యాప్టో ఏర్పేడు మండల శాఖ అధ్యక్షుడిగా రాజు రామచంద్రరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఏర్పేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్యాప్టో సమావేశం నిర్వహించారు. సంఘం మండల శాఖ అధ్యక్షుడిగా రాజు రామచంద్రరావు, గౌరవాధ్యక్షుడిగా రామాంజనేయులు, సహాధ్యక్షులుగా నిరంజన్, ఆదినారాయణ, హరిబాబు, ప్రధాన కార్యదర్శిగా గురవారెడ్డి, కార్యదర్శులుగా సూర్యనారాయణ, నాగరాజు, దేవరాజులు, ఉష, శాంతి, మధుసూదన రాజు, చెంచుబత్తెయ్య, రత్నకుమార్, కోశాధికారిగా రామకృష్ణయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బడిఈడు పిల్లలందరూ పాఠశాలలోనే ఉండాలి

బుచ్చినాయుడుకండ్రిగ: బడిఈడు పిల్లలందరూ పాఠశాలలోనే ఉండాలని ఎంఈఓ మునిసుబ్రమణ్యం అన్నారు. మండలంలోని గాజులపెళ్లూరు పంచాయతీ పరిధిలోని ఆదిలక్ష్మయ్య గిరిజన కాలనీలలోని బడి మానేసిన ఇద్దరు పిల్లలను శుక్రవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ మునిసుబ్రమణ్యం చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని తెలిపారు. బడి మానేసిన పిల్లలను బడిలో చేర్పించాలచేలా తల్లిదండ్రులను చొరవ చూపాలన్నారు. హెచ్‌ఎం వల్లెమ్మ పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

సత్యవేడు: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీఓ దేవకుమారి తెలిపారు. శుక్రవారం మాదనపాళెం పాఠశాలలో 'బాల్యవివాహాలను అరికడదాం- ఆడపిల్లలను కాపాడుకుందాం' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు చేస్తే తల్లిదండ్రులపై చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ చెంచులక్ష్మి పాల్గొన్నారు.

కుష్టురహిత సమాజానికి కృషి చేయాలి

బుచ్చినాయుడుకండ్రిగ: కుష్టు వ్యాధి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని వైద్యాధికారి దివాకర్ పిలుపునిచ్చారు. మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం గిరిజన కాలనీలోని గిరిజనులకు శుక్రవారం కుష్టు వ్యాధి నివారణ, వ్యాధి లక్షణాలు, నిర్ధారణపై వైద్యాధికారి దివాకర్, సీహెచ్‌ఓ వేంకటేశ్వర్లు అవగాహన కల్పించారు. కాలనీలోని పురవీధులలో కుష్టు వ్యాధిపై ర్యాలీ నిర్వహించారు. గ్రామ సచివాలయ, వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఎండోమెంట్ కమిషనర్



గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద సత్యనారాయణ

శ్రీకాళహస్తి: రాష్ట్ర ఎండోమెంట్ కమిషనర్ ఎస్. సత్యనారాయణ శుక్రవారం జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఈఓ ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి సాంప్రదాయబద్ధంగా వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమలో స్థానిక న్యాయమూర్తులు శ్రీనివాస్‌నాయక్, ధర్మారావు పాల్గొన్నారు.

కంప్యూటర్ల వితరణ



మాట్లాడుతున్న తిల్లై గోవిందం

రేణిగుంట: మండలంలోని గుత్తివారిపల్లి జెడ్పీ హైస్కూలుకు తిరుపతికి చెందిన ఏజీఎస్ హెల్త్ కంపెనీ వైద్య విజ్ఞాన సంస్థ అధినేత 20 కంప్యూటర్లు వితరణ చేశారు. హైస్కూల్ ఆవరణలో శుక్రవారం ఏజీఎస్ హెల్త్ డైరెక్టర్ తిల్లై గోవిందం సభ్యుల సహకారంతో హెచ్‌ఎం పురుషోత్తానికి కంప్యూటర్లు అందజేశారు.

స్పర్శతో గుర్తిద్దాం.. చైతన్యంతో కళ్లెం వేద్దాం



సమాజానికి దూరంగా.. రక్త సంబంధీకుల ఆదరణకు నోచుకోకుండా.. బతుకు భారంగా మార్చే భయంకర వ్యాధి 'కుష్టు'. జీవితాన్నే నాశనం చేసే ఈ మహమ్మారిని అప్రమత్తతతోనే దరిచేరకుండా చేయవచ్చు. సత్యవేడు నియోజకవర్గంలో ఏటా పెరుగుతున్న ఈ వ్యాధిని స్పర్శతో గుర్తించి, చైతన్యంతో కళ్లెం వేద్దాం.. అని వైద్యులు చెబుతున్నారు.

- ఏటా బయట పడుతున్న కొత్త కేసులు
- ప్రారంభమైన ఇంటింటా సర్వే
- సత్యవేడు నియోజకవర్గంలో 70 మంది బాధితులు
- కట్టడికి వైద్యాధికారుల చర్యలు



చిన్న పాండూరులో కుష్టు వ్యాధి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

వరదయ్యపాళెం: 'కుష్టు' చాపకింద నీరులా విస్తరిస్తోంది. నిర్లక్ష్యం చేసిన వారి ఆరోగ్యాన్ని కబళిస్తోంది. వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు పల్లెల్లో ఇంటింటా తిరిగి సర్వే చేస్తూ బాధితులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా ఈ నెల 18 వ తేదీ నుంచి సత్యవేడు నియోజకవర్గంలోని 9 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఒక సీహెచ్‌సీ పరిధిలో కుష్టు వ్యాధి బాధితులను గుర్తించేందుకు విస్తృతంగా సర్వే చేస్తున్నారు. గ్రామాల్లో ప్రారంభమైన సర్వే ఆగస్టు 2వ తేదీ వరకు కొనసాగనుంది. అలాగే వ్యాధిపై అవగాహన కల్పించడంతోపాటు ఉచితంగా మందులు అందజేస్తున్నారు.

ఏడు మండలాల్లో 70 మంది వ్యాధిగ్రస్తులు

సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల్లో కుష్టు వ్యాధి లక్షణాలు అక్కడక్కడా కనిపిస్తున్నాయి. నియోజకవర్గంలో మూడేళ్ల నుంచి 70 మందికి పైగా కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించారు. వీరిలో 40 మందికి పైగా చికిత్స పొంది కోలుకున్నారు. అలాగే ఈ ఏడాది వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు రెండు రోజుల నుంచి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వైద్య సిబ్బంది సర్వే చేపడుతున్నారు. ఆగస్టు 2వ తేదీ వరకు కుష్టు వ్యాధిగ్రస్తులను పూర్తిస్థాయిలో గుర్తించేందుకు వీలు ఉంటుందని వైద్యశాఖ భావిస్తోంది.

కేసుల వివరాలివీ..

మండలం పేరు	వ్యాధిగ్రస్తుల సంఖ్య
బీఎన్‌కండ్రిగ	6
నారాయణవనం	26
వరదయ్యపాళెం	11
సత్యవేడు	5
నాగలాపురం	10
పిచ్చాటూరు	2
కేవీబీపురం	9
మొత్తం	70

కుష్టు అంటువ్యాధి కాదు

కుష్టు అంతగా అంటువ్యాధి కాదు. ఈ వ్యాధి పూర్తిగా నయం కాని జబ్బేమీ కాదని వైద్య నిపుణులు చెబుతున్నారు. వ్యాధిని ప్రాథమిక దశలోనే గురించి సక్రమంగా మందులను వాడితే కోలుకోవచ్చంటున్నారు. నిర్లక్ష్యం చేస్తేనే కబళిస్తుందని హెచ్చరిస్తున్నారు. కుష్టు వ్యాధిగ్రస్తులు వారి కుటుంబ సభ్యులతో కలసి జీవించచ్చు. కుష్టు లైంగికంగానూ సంక్రమించదు. గర్భం ద్వారా పుట్టబోవు బిడ్డకు వ్యాపించదు. వ్యాధి సోకిన వ్యక్తి ముక్కు ద్రవంతో, దగ్గు లేదా స్పర్శ ద్వారా వ్యాప్తి చెందుతుంది. రోగనిరోధక శక్తి ఆధారంగా 95 శాతం మందికి వ్యాధి సోకినా అభివృద్ధి చెందదు.

కుష్టులో రకాలివీ..

కుష్టులోనూ రెండు రకాల వ్యాధులు ఉంటాయి. బాసిల్లిరీ వ్యాధి ఉన్న వ్యక్తికి శరీరంపై 5 రకాల మచ్చలు ఉంటాయి. మల్టీ బాసిల్లరీ వ్యాధి సోకిన వ్యక్తి శరీరంపై 5 కంటే ఎక్కువ మచ్చలు ఉంటాయి. స్పర్శ ఉండదు. చర్మం బయాప్సీలో యాసిడ్ ఫాస్ట్ బాసిల్లిరీ కనుగొనడంతో రోగాన్ని నిర్ధారిస్తారు. మల్టీ డ్రగ్స్ థెరపీతో కుష్టు వ్యాధిని నయం చేసుకోవచ్చు.

రూపుమాపడమే లక్ష్యం



కుష్టు వ్యాధిని రూపుమాపడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నాం. నియోజకవర్గంలో అక్కడక్కడా కుష్టు వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నాయి. దీన్ని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. ఇప్పటి వరకు గత ఏడాది గుర్తించిన వ్యాధిగ్రస్తులకు చికిత్స చేస్తున్నాం. సర్వే తర్వాత ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. వ్యాధి సోకిన వారు భయాందోళన చెందకుండా జాగ్రత్తగా మందులు వాడితే నయమవుతుంది. సర్వే కోసం ఇంటి వద్దకు వచ్చే సర్వే బృందానికి ప్రజలు సహకరించాలి. వ్యాధి ఉన్నట్లు తేలితేనే నయం చేసేందుకు వీలవుతుంది.

–ఉదయ్ కుమార్, ప్రధాన వైద్యాధికారి, పీహెచ్‌సీ, వరదయ్యపాళెం

వంక పోరంబోకు కబ్జా



రేణిగుంట రాజరాజేశ్వరి ఆలయ సమీపంలోని చదును చేసిన వంక పోరంబోకు

రేణిగుంట: పట్టణంలో శుక్రవారం ఉదయం ఓ వంక పోరంబోకు స్థలాన్ని జేసీబీతో చదును చేయించి కొందరు అధికార ముసుగులో దురాక్రమణకు తెగబడ్డారు. రాజరాజేశ్వరీదేవి ఆలయ సమీపంలో ఉన్న 10 సెంట్ల వంకపోరంబోకు స్థలానికి సంబంధించి కొందరు వ్యక్తులు ఫోర్జరీ పట్టాలు సృష్టించి గతంలో చదును చేసేందుకు యత్నించారు. అప్పట్లో ఈ ఘటనను అడ్డుకోవడంతో విఫలమయ్యారు. టీడీపీ అధికారంలోకి రావడంతో ఇప్పుడు మరోసారి ముళ్లచెట్లు జేసీబీ సాయంతో తొలగించి చదును చేశారు. ఈ ప్రాంతంలో సెంటు స్థలం రూ.10 లక్షలకు పై మాటే. ఈ లెక్కన రూ. కోటి విలువైన ప్రభుత్వ స్థలాన్ని కాజేసేందుకు కుయుక్తులు పన్నుతున్నారు. రెవెన్యూ అధికారులు విచారించి విలువైన స్థలాన్ని పరిరక్షించాలని కోరుతున్నారు. అయితే దీనిపై వివరణ కోరేందుకు తహసీల్దార్ నాగేశ్వరరావును ఫోన్‌లో సంప్రదించగా, సెలవులో ఉన్నట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు.



పరిసరాల శుభ్రత అవసరం

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ తెలిపారు. శుక్రవారం బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలో డ్రైడే నిర్వహించారు. గ్రామంలోని డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయించారు. తాగునీటి ఓవరుహెడ్ ట్యాంకును శుభ్రం చేయించి, క్లోరినేషన్ చేయించారు. అనంతరం పారిశుద్ధ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం మొదలవుతుండడంతో దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలని, తాగునీటిని కాసి వడపోసి తాగాలని, మురుగునీటి నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యకితగత శుభ్రత పాటిస్తే కొంత వరకు వ్యాధులను అరికట్టవచ్చన్నారు. వైద్య సిబ్బంది సూచనలు పాటిస్తే వ్యాధుల భారీన పడకుండా ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మునిరాజా, గ్రామ సచివాలయ, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది, పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కార్యదర్శి ఇందిరమ్మ

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ఏర్పేడు: ఉపాధి హామీ పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బాలకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆమందూరు సచివాలయంలో రెవెన్యూ అధికారులకు సమస్యల పరిష్కారానికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సుమారు 3 నెలలుగా ఉపాధిహామీ కూలీలకు వేతనాలు చెల్లించలేదన్నారు. వేతనాలు చెల్లించకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వారి కుటుంబ పోషణ దయనీయంగా మారిందన్నారు. పనులను 100 రోజుల నుంచి 200 రోజులకు పెంచాలని కోరారు. ప్రభుత్వం నిత్యావసర సరకుల ధరలను తగ్గించాలని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు గురవమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిపై దాడి దుర్మార్గం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నాగలాపురం: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై పుంగనూరులో టీడీపీ నేతలు దాడికి పాల్పడడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ నాగలాపురం మండల నేతలు అన్నారు. పుంగనూరులోని చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప నివాసానికి వెళ్లిన మిథున్ రెడ్డిపై దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అని వారు అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజలకు శాంతి భద్రతలు కరువయ్యాయన్నారు. మహిళలు, బాలికలకు రక్షణ కరువైందన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన పార్లమెంటు సభ్యునికే రక్షణ కల్పించని ప్రభుత్వం సామాన్య కార్యకర్తలకు ఏమి రక్షణ కల్పిస్తుందన్నారు. ఒక ఎంపీపై రాళ్ల దాడి చేస్తుంటే రక్షణ కల్పించాల్సిన పోలీసులే చోద్యం చూస్తుంటే, రాష్ట్రంలో ఎలాంటి అటవిక పాలన కొనసాగుతుందో అర్థం చేసుకోవాలన్నారు. గతంలో ఏ ప్రభుత్వం లేని విధంగా దాడులకు పాల్పడుతూ ప్రాణాల సైతం హతమారుస్తున్న పరిస్థితులను ప్రజలంతా చూస్తున్నారు. ఇకనైనా దాడులు ఆపి, రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మహేష్ రెడ్డి, శ్యామ్, దేశప్పన్, దానివేలు, రాజ, బాబు, పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ అభినందనీయం



పుస్తకాలు అందజేస్తున్న కేబీజీ అధినేత గురుదేవ్

వరదయ్యపాళెం: కేబీజీ కళ్యాణ మండపం అధినేత కేబీ గురుదేవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యా సామగ్రిని వితరణగా అందజేయడం అభినందనీయమని బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప అన్నారు. గురుదేవ్ జన్మదినం సందర్భంగా సీఎల్‌ఎన్‌పల్లె, గొసియానగర్, ముస్లింపాళెం, బలిజపాళెం, వరదయ్యపాళెం, గోవర్ధనపురం, ఇందిరానగర్, కాంబాకం ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను వితరణ చేశారు. అనంతరం జన్మదిన వేడుకలకు హాజరైన స్థానికులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పురుషోత్తమ్, సిద్ధలయ్య, మునిప్రతాప్, సుబ్బరత్నమ్మ, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులొస్తే చర్యలు

సత్యవేడు: కార్డుదారులకు నిత్యావసర సరుకులు సక్రమంగా సరఫరా చేయాలని, బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నట్లు వినియోగదారుల నుంచి ఫిర్యాదులొస్తే చర్యలు తీసుకొంటామని తహసీల్దార్ రామాంజనేయులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం మండల రెవెన్యూ కార్యాలయంలో 55 మంది రేషన్ డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీ నుంచే బియ్యం కార్డుదారులకు ఇబ్బంది లేకుండా సరఫరా చేయాలని, రోజు 150 నుంచి 200 కార్డుదారులకు బియ్యం అందించాలన్నారు. నెలలో 18 తేదీన స్టాకు వివరాలు రెవెన్యూ కార్యాలయంలో అందజేయాలన్నారు. చనిపోయిన వారు, ఊరు వదలిపోయిన వారి వివరాలు అందించాలని కోరారు. గ్రామాలకు ఎండీయూలు ద్వారా బియ్యం సరఫరా చేసే రోజులు ముందుగానే గ్రామంలో కార్డు దారులకు తెలియజేయాలని సూచించారు. ఆంబాకం, ఏఎం పురం, ఆరూరు, బాలకృష్ణాపురం, మదనంజేరిలలో సర్వర్లు సక్రమంగా పనిచేయక పోవడంతో సరఫరాలో జాప్యం జరుగుతోందని డీలర్లు తహసీల్దార్ దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈ రవిచంద్ర, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

యాప్‌ల భారం తగ్గించాలి



మాట్లాడుతున్న త్యాగరాజులు

సత్యవేడు: ఉపాధ్యాయులు ఎన్నో యాప్‌లతో సతమతమవుతున్నారని, యాప్‌ల భారం తగ్గించాలని యూటీఎఫ్ అధ్యక్షుడు ఓ. త్యాగరాజులు కోరారు. శుక్రవారం సాయంత్రం ఎస్‌ఎంయూ స్కూల్ ఆవరణలో యూటీఎఫ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరంగా పెండింగ్‌లో ఉన్న ఏపీజీఎల్, ఈపీఎఫ్, సరెండర్ లీవ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చంద్రయ్య, నాయకులు ఏబీ గురునాథం, ప్రభావతి, మహేశ్వరయ్య, గీత, నరేష్, దుర్గాప్రసాద్, రాజకుమార్, బాలకృష్ణ , మునికళ్యాణి , ఎంఎం శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువు పనులతో ఆర్థికాభివృద్ధి



పనులు పరిశీలిస్తున్న శ్రీనివాసప్రసాద్

ఏర్పేడు: ఉపాధిహామీ పథకంలో చెరువుల్లో చేపల చెరువుల పనులు చేపడితే గ్రామ పంచాయతీల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు జరుగుతుందని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని మాధవమాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీల మస్టర్‌ను తనిఖీ చేశారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ చేపల చెరువులను ఏర్పాటు చేసుకుంటే పంచాయతీల ద్వారా వేలం నిర్వహించి చేపల పెంపకం చేపట్టవచ్చన్నారు. చేపల చెరువు వేలంలో వచ్చే ఆదాయంతో గ్రామాభివృద్ధి పనులు చేపట్టవచ్చన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో వ్యవసాయ పనులు లేనందున ఉపాధిహామీలో కూలీలకు విరివిగా పనులు కల్పించాలని సూచించారు. ప్రతి రోజూ కూలీలకు రూ.300 వేతనం వచ్చేలా పనుల్లో కొలతలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ దేవరి, జేఈ బాలాజీరావు, కూలీలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాగలాపురం: పిచ్చాటూరు మండలంలోని కారూరు, గోవర్ధనగిరి సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏడీ చంద్రనాయక్, ఏఈ రవి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

సుబ్బానాయుడుకండ్రిగ సబ్‌స్టేషన్ పరిధిలో..

నాగలాపురం: మండలంలోని సుబ్బనాయుడు కండ్రిగ, సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ జైసాయి తెలిపారు. మరమ్మతు పనులు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

చిన్నపాండూరు సబ్‌స్టేషన్ పరిధిలో..

సత్యవేడు: చిన్న పాండూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు విద్యుత్ సరఫరా ఆపి వేస్తున్నట్లు ఏఈ జగదీశ్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఓబుల రాజుకండ్రిగ, పీవీ పురం, రాజగోపాలపురం, రేపల్లెవాడ, చమర్తికండ్రిగ, ఆనందాపురం ఎస్టీకాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం (వరదయ్యపాళెం): గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. శుక్రవారం కేవీబీపురం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రాయదుర్గం మునిలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అలాగే ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడంలో అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. అర్హత ఉన్న వారికి సంక్షేమ పథకాలు అందించడంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. అధికారులు ఎక్కడైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ అందరి సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సహకరించాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు మునెమ్మ, ఎంపీడీఓ రెడ్డెయ్య, తహసీల్దార్ శ్రీరాములు నాయక్, పంచాయతీరాజ్ డీఈ మధుసూదనరావు, ఎంఈఓలు లక్ష్మీపతి, రవి కుమార్ పాల్గొన్నారు.

సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం

వరదయ్యపాళెం: ఆటో కార్మికుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ తెలిపారు. శుక్రవారం కడూరు కూడలిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ ఆటోస్టాండ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏఐటీయూసీ ఆయన మాట్లాడు తూ ఆటో కార్మికుల హక్కుల కోసం పోరాడుతామని తెలిపారు. సత్యవేడు నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు చిన్నిరాజ్ మాట్లాడుతూ జీఓ నంబరు 21ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు అన్నాదొరై, చంద్రబాబు, జిల్లా ఉపాధ్యక్షులు మణి, సుభాష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి మృతి



బిక్రమ్ హాన్స్‌డా మృతదేహం

ఏర్పేడు: మండలంలోని కొత్తకండ్రిగ సమీపంలో ఉన్న పుష్పిత్ కర్మాగారంలో శుక్రవారం ఓ కార్మికుడు మృతి చెందాడు. ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు కథనం మేరకు.. ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బిక్రమ్ హాన్స్‌డా(24) మండలంలోని పుష్పిత్ కర్మాగారంలో వెల్డింగ్ వర్క్ చేసే కార్మికుడు. ఇతడు శుక్రవారం కర్మాగారంలో విధులు నిర్వహిస్తుండగా కాలుజారి కిందకు పడడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బిక్రమ్ హాన్స్‌డా తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం రేణిగుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరీక్షలు చేసి అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారు. పోస్టుమారం కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

మహిళలు అన్ని రంగాల్లో పట్టు సాధించాలి



సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

రేణిగుంట: పోటీ ప్రపంచంలో మనుగడ సాధించాలంటే మహిళలు విద్యతోపాటు అన్ని రంగాల్లో పట్టు సాధించి ముందు వరుసలో నిలిచినప్పుడే మహిళా సాధికారిత సాధ్యమవుతుందని భారత్ బయోటెక్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుచిత్ర ఎల్లా పిలుపునిచ్చారు. సీఐఐ(ద కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) మహిళా విభాగం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రమాదేవి గొరినేని అధ్యక్షతన మండలంలోని కరకంబాడి అమరరాజ ఆడిటోరియంలో శుక్రవారం మహిళా సాధికారిత లీడర్‌షిప్ క్లానేవ్ ఆఫ్ పయనిరింగ్ ప్రొగెస్ అనే అంశంపై ఒక రోజు ప్రత్యేక సదస్సు జరిగింది. ఈ సదస్సుకు అమరరాజా సంస్థల ఎండీ, మాజీ ఎంపీ గల్లా జయదేవ్, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, సీఐఐ చైర్మన్, మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ మురళి, సీఐఐ సదరన్ రీజినల్ చైర్మన్ షిరిన్ సాలిస్, అరవింద్ ఐ ఆస్పత్రి ఫౌండింగ్ సభ్యుడు నట్‌చైర్, గ్రీన్‌తత్వా అగ్రిటెక్ కోఫౌండర్ రూపా మాగంటి, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ పాల్గొన్నారు. ముఖ్య అతిథి సుచిత్ర ఎల్లా మాట్లాడుతూ నేడు అన్ని రంగాల్లో మహిళలు ముందుకు వెళుతున్నారని, అయితే పోటీ ప్రపంచంలో సాంకేతికతను మెరుగు పర్చుకోవాల్సిన అవసరముందన్నారు. సీఐఐ చైర్మన్ డాక్టర్ రమాదేవి, వైస్‌చైర్మన్ చాందిని చందనా పలు అంశాలపై చర్చించారు.

రాజకీయ వేధింపులు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అంగేరి పుల్లయ్య

శ్రీకాళహస్తి: చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు మానుకోవాలని సీఐటీయూ అంగేరి పుల్లయ్య హెచ్చరించారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో స్కీం వర్కర్లుగా పనిచేస్తున్న అంగన్‌వాడీ, ఆశ, సంఘమిత్ర, మిడ్‌డేమీల్స్, స్కూల్ స్వీపర్స్ తదితర చిన్న ఉద్యోగాలను చేసే వారిని టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని అన్నారు. అనంతరం నేతలు మాట్లాడుతూ ×మీరు రాజీనామా చేయండి... మా వారిని పెట్టుకుంటాం అంటూ బెదిరిస్తూ కక్ష సాధింపు చర్యలు పాల్పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వానికి ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. ఈ ప్రభుత్వంలో చిరుద్యోగులకు వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. సీఎం వెంటనే జోక్యం చేసుకుని ఆపాలన్నారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమలలో పెనగడం గురవయ్య, మణి, జాకీర సంఘమిత్ర, ఆశలు, లాజర్, చాముండేశ్వరి, శీను తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ రవి

సత్యవేడు: అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు సీజనల్ వ్యాధులు–వ్యక్తిగత శుభ్రతపై ఎంపీడీఓ కే. చంద్రశేఖర్, ఎంఈఓ కే.రవి, ఏఎన్‌ఎంలు రోసిలిన్ శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల అధికారులు, ఏఎన్‌ఎంలు కలసి హాస్టల్, స్కూల్ పరిసరాల్లో లార్వా సర్వే చేపట్టారు. అనంతరం విద్యార్థులకు డెంగీ, డయేరియా వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎంలు వ్యక్తి గత శుభ్రత, చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. కాచిన నీటి తాగాలన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ బీవీ వసుంధర, సర్పంచ్ టి. జయ, సచివాలయ కార్యదర్శి హరీష్, ఎంఎల్‌హెచ్‌పీ సుప్రియ పాల్గొన్నారు.

వైభవంగా ప్రదోష పూజలు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లెలో ఉన్న పల్లికొండేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రదోష పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కల్, సతీష్ శర్మ, గణేష్ శర్మ, ఆలయంలోని నందీశ్వరునికి, శ్రీ వాల్మికేశ్వర స్వామివారికి ఏక కాలంలో పూజలు చేశారు. ఈ ప్రదోష పూజలకు ప్రసాదాలు నింద్ర గ్రామానికి శ్రీనివాస మిల్క్ డెయిరీ ఎండీ వాసుదేవనాయుడు, ఆయన కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈఓ కె.రామచంద్ర రెడ్డి, సిబ్బంది పరంధామరెడ్డి, శరవణ పాల్గొన్నారు.



నందీశ్వరునికి పాలాభిషేకం చేస్తున్న అర్చకులు